REGD. NO. A. 40 ఒక ప్రతి 12 నయాపైసలు 14-2-58 శుక్రవారం

# జమీన్ రైతు

సంపుటి 30 ⁑ మేనేజింగు ఎడిటరు : నెల్లూరు వెంకట్రామానాయుడు :: సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ⁑ సంచిక 7

## హైదరాబాద్ లేఖ

★ ★ ★ మా విలేకరి ★ ★ ★

## హెచ్చుతున్న ఆంధ్ర తెలంగాణా విభేదాలు

సంయుక్తాంధ్రరాష్ట్రం ఏర్పడి సంవత్సరం దాటినా, ఆంధ్ర-తెలంగాణా విభేదాలు సమసిపోకపోగా యింకా హెచ్చవుతున్నవనే చెప్పవలసి వుంటుంది. రాజకీయ రంగంలో ఇది చాలావరకు రాజకీయ వేత్తల సమస్య. కాని పరిపాలనా యంత్రాంగంలోను, రాజధానిలోని ప్రభుత్వ కార్యాలయాల్లోను, ఈ విభేదాలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఇందుకు ప్రభుత్వ విధానాలుకూడా తోడ్పడుతున్నాయి. కొంత తెలివితేటలు, వ్యవస్థా అవలంభించే సాహసం ప్రభుత్వంలో వుంటే పరిస్థితి విషమరూపం దాల్చకపోను.

తొమ్మిది సంవత్సరాలక్రితం నిజామ్ సంస్థానంపై సర్దార్ పటేల్ జరిపిన పోలీసు చర్య శస్త్రచికిత్సలాంటిది కావడంవలన, అరాజకం నెలకొనకుండా వుండేటందుకు, యూనియన్ సైన్యాలతోపాటు పదహారు జిల్లాలకూ కలెక్టర్లనుంచి తహశీల్దార్ల వరకు సిబ్బందిని కేంద్రప్రభుత్వం పంపించింది. బొంబాయి, మధ్యప్రదేశ, మద్రాసు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సిబ్బందిని పంపించాయి. మద్రాసునుంచి వచ్చిన వారిలో నిజంగా సమర్థులు బహుకొద్దిమంది. అక్కడ, అప్పటికి అనవసరం అనిపించినవారిని, తక్కువ హోదాల్లో ఉన్నవారిని ప్రమోషన్లు యిచ్చి పంపించారు. యోగ్యత లేకపోవడంతో పాటు, తాము విజేతలమనే భావంతో వీరు తమ బాధ్యతలను నిర్వహించ ప్రారంభించారు. విజయమంటూ సాధిస్తే అది స్థానిక ప్రభుత్వంపైన కాని ప్రజలమీదకాని, అసలా విజయాన్ని కేంద్రప్రభుత్వం సాధించింది కూడా స్థానిక ప్రజలకోసమేనని వీరు విస్మరించి, అధికార మదాంధతతో వీ ప్రవర్తించారు. దీనితో పోలీసుచర్యవల్ల రజాకార్ల దౌర్జన్యం విముక్తికలిగిందని ఆనందించిన ప్రజలు త్వరలోనే నిరాశ చెందారు. విశాలాంధ్రోద్యమం ఆమాత్రం బలం చేకూర్చుకోనడానికి ఆ నిరాశే చాలావరకు కారణం.

ఆంధ్రప్రదేశ్ అవతరణలో ఇక్కడికి వచ్చిన ఉద్యోగులు తమని విజేతలని భావించక పోయినప్పటికీ, ఇక్కడివారు అజ్ఞానులు, వెనుకబడినవారు అని గట్టిగా విశ్వసిస్తున్నారు. ఈ బడుగువారికి ఎక్కువ జీతాలు వుండటమేమిటని వీరి ప్రశ్న. ఎప్పటికైనా వారు మాక్రిందపనిచేయాల్సిందే కాని మేము వారిక్రింద ఎలా పనిచేస్తాము అంటారు. మరి తెలంగాణా వారేమో మాకంటే తక్కువ జీతాలు తీసుకునే వారిక్రింద ఎలా పని చేయాలీ అని బాధపడుతున్నారు. ఐ.ఏ.ఎస్. అధికార్లు ఏదోవిధంగా సరుదుకున్నా, నాన్ గజిటెడ్ సిబ్బందిలో ఇలాంటి మానసిక ఘర్షణలు జరుగుతున్నాయి. సీనియర్ ఉన్నతాధికార్లుకూడా పూర్వ మద్రాసు ప్రభుత్వ పరిపాలనా నిబంధనలే ఉత్తమమైనవనీ, కొన్ని దశాబ్దాల అనుభవం వీటివెనుక వున్నదనీ, కనుక వాటినే ఇక్కడ అమలు జరిపాలంటారు. కాని హైదరాబాదులో కూడా పరిపాలనా పద్ధతులు కొన్ని దశాబ్దాలుగా వున్నాయనీ, వాటిలో మంచి ఏమైనా వుందేమో చూద్దామనీ తలంచరు. హైదరాబాదు ప్రభుత్వవ్యవస్థ భూస్వామ్య బద్ధమైనది (Feudal). అయితే మద్రాసు రాష్ట్రంలో అప్పటికీ, ఇప్పటికీ ప్రభుత్వ పద్ధతులు, విదేశపాలకులు, స్థానికప్రజలను సర్వదా దాశ్యశృంఖలాబద్ధంచేసి ఉంచేటందుకే ఉద్దేశించి రూపొందించ బడినట్టివే. ఈ పద్ధతుల మూలముగా పనిజరిగడంకంటే ఆయాఅధికార్ల అధికారం, హోదాలపై, నిబంధనల అర్థాలపై చర్చ హెచ్చు. సంక్షేమరాజ్య స్థాపనామార్గంలో దేశం సాగిస్తున్న పురోగమనంలో, ఈ పద్ధతులు కలిగిస్తున్న జాప్యం, అందరికీ అనుభవైకవేద్యమే. అయినా వీటి గొప్పతనాన్ని ధర్మశాస్త్రాలవలెనమ్ముతూ, వీటిని మార్చాలనడం మహాపచారమని మన పరిపాలకుల అభిప్రాయం.

బ్రిటిష్‌వారు నిర్మించిన ఈ యంత్రాంగం స్వరూపస్వభావాలే, పోషలిస్టు సమాజానికీ, ప్రజాస్వామిక వ్యవస్థకు వ్యతిరేకమైనవి. ఈ యంత్రంలో ఒక ఐ.ఏ.ఎస్. ఆఫీసరుతో కానీ, తనకంటే తక్కువ హోదాకల ఉద్యోగితో కాని మాట్లాడటం అమర్యాదకరమనుకుంటాడు. ఆఫీసరు దగ్గరకు క్లర్కుపోతే నిలబడి వుండవలసిందే. మరి పూర్వపు హైదరాబాదులో అత్యున్నతాధికార్లు కూడా ప్యూనులను “మీరు” అని సంబోధించేవారు. అలాంటి సంప్రదాయానికి అలవాటుబడిన ఉద్యోగులకు ఇప్పటి అధికార్ల ప్రవర్తన కంటకంగావుంటే ఆశ్చర్యమేమిటి? ఇలాంటి సంఘర్షణలు, ప్రతి కార్యాలయంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జరుగుతున్నాయి. కొటి అవసరాలకు మాత్రే

మద్రాసు-ఆంధ్ర పరిపాలనా పద్ధతులు కానీ, పూర్వ నిజామ్ ప్రభుత్వ నిబంధనావలి కాని తగినవి కావని వేరే చెప్పనక్కరలేదు. కాని ఈ రెంటిలోను ఉన్నమంచిని స్వీకరించి ఒక కొత్త కార్యపద్ధతిని రూపొందించే ప్రయత్నంమాత్రం ఇంకా ప్రారంభం కాలేదు.

పరిపాలనా యంత్రాంగంలో స్థితి యిలా ఉంటే, ప్రభుత్వ విధానాల ధోరణికూడా - ఆంధ్ర - తెలంగాణాల ద్వైవిధ్యాన్ని ఇంకా పోషించేట్టుగానే కనపడుతున్నది. హైదరాబాదు రాష్ట్రంలో నెలకొన్న మొదటి ప్రజా ప్రభుత్వం బూర్గుల రామకృష్ణరావుగారిది. నిజామ్‌పాలన కాలంలో కుంటుపడిన విద్యా విషయక అభివృద్ధిని ప్రజాప్రభుత్వ హయాములో శరవేగంతో కొనసాగించవలసి వచ్చింది. గత ఏడు సంవత్సరాలలో, ప్రతి జిల్లాలోను అసంఖ్యాకంగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యాలయాలు యేర్పడ్డాయి. ప్రతి జిల్లాలో కళాశాలలుకూడా ఏర్పాటుచేయాలని ప్రయత్నం జరిగింది. నిజామాబాదు - ఖమ్మం - కరీంనగర్ - నల్లగొండ - ఆదిలాబాదు - సిద్దిపేటలలో ముఖ్యంగా స్థానికప్రజల సహాయంతోను, ప్రభుత్వ ఊతతోను కళాశాలలు 1955-56 సంవత్సరంలో ఏర్పడ్డాయి. వరంగల్లు మొదలైన ప్రాంతాల్లో ఆయుర్వేద కళాశాలలు కూడా స్థాపించారు. వీటిలో కొన్నింటికి పూర్వ హైదరాబాదు వాగ్దానం చేసిన ఆర్థికసహాయం, ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ ప్రభుత్వం యివ్వదంలేదనీ, మరికొన్నింటిని ముఖ్యంగా వరంగల్ ఆయుర్వేద కళాశాలను పరిగణించక జాగుచేస్తున్నదని తెలుస్తున్నది.

యూనియన్ అధ్యక్షుడు నెలకొల్పిన తెలంగాణా ప్రాంతీయసంఘం ఈ సమస్య లన్నింటినీ పరిశీలించి ఈ సంస్థలు దెబ్బతినకుండా చూడాలి. మంత్రివర్గస్థాయిలో కీచులాటపడక ప్రజలకు సంబంధించిన సమస్యల విషయంలో శ్రద్ధవహిస్తే, కొంతకాలం తరువాత ప్రాంతీయ సంఘమంటూ వేరే ఉండనక్కరలేకుండా, ఆంధ్ర - తెలంగాణా ప్రజలు సమైక్యత చెందగలరు.

(11-2-1958)

---

## మన పార్లమెంటు

★

పార్లమెంటులో ఎప్పుడూ న్యాయవాదులకే అధిక సంఖ్య. ఇదివరలో నూటికి 35.6 మంది సభ్యులు న్యాయవాదులుగా వుండేవారు. ఇప్పుడు వారి సంఖ్య నూటికి30కి తగ్గిపోయింది. నూటికి 22.4 వున్న రైతులు (ఇందులో జమీందార్లుకూడా వున్నారట) 29.1 కి పెరిగింది. కాని దీనికి తగినట్లు రైతులమాటకు పార్లమెంటులో బలంలేదు. విద్యావేత్తలు, మాజీ సంస్థానాధీశులు, రిటైర్డు ఉద్యోగులబలంకూడా పార్లమెంటులో పెరిగింది గాని. పారిశ్రామిక వేత్తలు, అందరిని అందలాలెక్కించే పత్రికారచయితలు, వ్యాపారస్తుల సంఖ్యమాత్రం తగ్గిపోయిందట.


## శ్రీ బాలాజీ యాత్రా స్పెషల్

6-4-58 తిరుపతినుండి 10-4-58 నెల్లూరునుండి బయలుదేరును!

75 దినముల యాత్ర

కాశీ, బదరి, కాశ్మీరములు సందర్శింపబడును

1 క్లాస్ ఉదయం ఫలహారం, రెండు భోజనములు, బదరి - కాశ్మీర బస్సు చార్జీలు ... రు. 800/-

3 క్లాస్ " " ... రు. 450/-

(12-4-57 జరిగిన యాత్రలో శ్రీ నాయుడు కోటారెడ్డి మొదలగు 12 మంది, ఇందుపూరు బుర్రగమ్మ, పూజారి సింహాద్రివర్మ మొదలగు నెల్లూరు మండల ప్రముఖులు 30 మంది ప్రయాణించిరి.)

-: ప్రొప్రైటర్ :-
కె. మునిరెడ్డి,
పోస్టు 4. బైరాగిమఠం : బాలాజీ.
తిరుపతి

-: బ్రాంచి ఆఫీసు :-
విజయా సైకిల్ షాప్
మద్రాసు పేటరోడ్
నెల్లూరు

ఇది 24 వ యాత్రా స్పెషల్

# భారతవీరుల ప్రశస్తి
## 18 రోజుల ఉపన్యాసాల సమీక్ష

వ్యాసభగవానుడు మొదలు నేటివరకు, పరంపరాగతంగా ప్రశంసింపబడు చున్న మహాభారత కథను, మహాభారతవీరుల ప్రశస్తి నుపన్యాస విన్యాసముల రూపమున, వర్ధమాన సమాజమువారు, జనవరి 20 నుండి యీ నెల 6 తేదీవరకు వరుసగా జెప్పించిరి. ఈ మహాభారతవీరుల ప్రశస్తి కార్యక్రమమును శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి గారు ప్రారంభించిరి. నెల్లూరు నగర పండితులు విద్యాధికులైన పదునెనిమిదిమంది ఉపన్యాసకులు, పదునెనిమిదిమంది సభాపతులు భారతవీరుల ప్రశస్తిని చక్కగా వివరించిరి. ఈ ఉపన్యాస విన్యాసములు నగరవాసుల హృదయాలను ఆకర్షించి, పురమందిరము క్రిక్కిరిసి పోవుచుండెను. సింహపురి పౌరులలో నూత్నోత్సాహమును జనింపజేసినవి.

ఇటీవల తిక్కన భారతమును గురించి, హైదరాబాదులో జరిగిన పండితగోష్ఠి తప్ప, మహాభారతవీరుల ప్రశస్తి నుపన్యాసములు ఆంధ్రలో మరెచ్చటను జరుగలేదని చెప్పవచ్చును. ఈ కార్యక్రమమును నిర్విఘ్నముగా కొనసాగించిన వర్ధమానసమాజం వారెంతయు ప్రశంసాపాత్రులు. ఈ కార్యక్రమ అఖండ విజయానికి శ్రీ నేలటూరి శ్రీకృష్ణమూర్తి గారి శ్రద్ధాసక్తులు, కృషి ముఖ్యకారణము లనవలెను.

పదునెనిమిది దినములు, ఒక్కొక్క దినము ఒక్కొక్క వీరునిగురించి, ఉపన్యాసములు జరిగినవి. మొదటి ఉపన్యాసము శ్రీకృష్ణద్వైపాయనుని గురించి శ్రీ విశ్వనాథ శ్రోతులుగారిచే గావింపబడినది. శ్రీ కృష్ణ ద్వైపాయనుడు భారత విజ్ఞానమును, వేద సారమును, మహాభారతమహాకావ్య రూపమున, లోకానికందజేసిన భట్టారకుడన్నారు శ్రీ శ్రోతులుగారు.

శ్రీ మామిడిపూడి రామకృష్ణయ్యగారు ధృతరాష్ట్రుని మానసిక పరివర్తనమును గురించి; ధర్మరాజు ధర్మప్రవర్తన, అసమాన రాజతంత్రమును గురించి; శకునికి మేనల్లునిపై గల ప్రేమాభిలాషలు, ఆ ద్యూత క్రీడయందు అతనికిగల అసమాన కౌశల్యము, శకుని వీరమరణమును గురించి చక్కగా ఉపన్యసించిరి. శకుని పాత్రణమును శ్రీ బి. మృత్యుంజయులుగారు చక్కగా చిత్రీకరించారు.

ద్రోణుడు గుణపక్షపాతముగల ధీరవ్యక్తి యని శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారన్నారు. భీమునిపరాక్రమము, క్రోధాగ్ని ప్రజ్వలనము, భాతృభక్తి, స్వామిభక్తిని గురించి శ్రీ కె. అనంత రామశాస్త్రి, నాటిసభాపతి శ్రీ అకిలి మల్లిఖార్జునయ్యగారలు భావయుక్తితో ముచ్చటించారు. అశ్వత్థామచరిత్రను ఉపన్యాసకులు శ్రీ సంగం జానకిరామయ్య సంపూర్ణముగ వివరించారు. భీష్ముని భక్తి, పరాక్రమము, బ్రహ్మచర్యదీక్ష, ప్రతిజ్ఞాపరిపాలనము, పితృభక్తి, రాజనీతి పారంగత, పాండవులయెడ వాత్సల్యమును గురించి సహకవి శ్రీ మోచర్ల రామకృష్ణయ్యగారు చక్కగా భాషించారు. కర్ణుని స్వామిభక్తి, స్నేహసౌజన్యము, ధర్మలబ్ధి, [illegible] వాక్యసాధనము, శౌర్య పరాక్రమములు, దాతృత్వ గుణము శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి గారు వర్ణించి, తాను రచించిన అముద్రిత "కర్ణ" గ్రంథమునుండి కృష్ణకర్ణ, కుంతీకర్ణ ఘట్టముల చదివి వినిపించారు. శ్రీ తిక్కవరపు రామరెడ్డిగారు నాటిసభ కధ్యక్షత వహించారు. ద్రౌపది పాతివ్రత్య మహిమ, శీలము, క్షాత్ర ధర్మమునుగురించి శ్రీ జి. సి. వి. రమణరావు వివరించారు.

అర్జునుని శీలమున ప్రధానాంశములైన సవ్యసాచిత్వము, ధనుర్విద్యా కౌశలము, అన్నపై గావ భక్తిప్రపత్తులను శ్రీ కోట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వర్ణించారు. నాటి సభాపతి శ్రీ తూములూరు శివరామయ్య పంతులుగారు పాండవులు పాటించిన అసత్యము, అధర్మములు రాజనీతిచే సమర్థించదగినవేనా, అవి యీనాడును అనుష్ఠించదగినవేనా యని ప్రశ్నించారు.

సుయోధనుని పితృభక్తి, స్నేహవాత్సల్యము, అభిమానసంపద, గదాయుద్ధ, జల, అగ్నిస్తంభనాది మారణోపాయములందు చతురతగురించి, శ్రీ పింగపాటి విశ్వేశ్వరశాస్త్రి, శ్రీ గుణ్ణం సుబ్రహ్మణ్యంగారలు సావధానంగా ఉపన్యసించారు. శల్యుని పరాక్రమం, అశ్వహృదయ సంగ్రహ చతురత [illegible] గుణవిశేషముల గురించి శ్రీ అవ్వన్నశాస్త్రి గారును; భయమునెరుగని తెలియని బుద్ధివీరుడు అభిమన్యుని గురించి శ్రీ చదలవాడ జయరామశాస్త్రిగారు ఉపన్యసించారు. విదురుడు చలని నప్పుడెల్ల ధర్మమును నిర్భయముగ వెల్లడిచేసెడివాడనీ, భారతకథ యందంతయు అంతఃకరణముపలె ఆయన అభ్యంతర జ్యోతిర్మై వెలిగెనని, శ్రీ ఓరుగంటి వెంకటసుబ్బయ్య, శ్రీ యస్. వెంకటరమణశర్మగారలు చెప్పారు. సంజయుడి దౌత్యమును శ్లాఘిస్తూ, ఆయన వాక్చమత్కృతి, పరోక్షజ్ఞానసంపన్నత, సమయస్ఫూర్తి, సత్యభాషణమును గురించి శ్రీ మ. మల్లికార్జునరావు, శ్రీ పి. శ్రీకంఠము గారలు వివరించిరి.

కుంతి వీరమాతయనీ; గాంధారి నిశ్చల పతిభక్తి, ధర్మపక్షపాతమును గురించి శ్రీ ఎ. నాగభూషణరావు గారు వర్ణించిరి. ఆనాడు సభనధ్యక్షించిన శ్రీమతి టి. వసుంధరగారు సత్యవతి, కుంతి, గాంధారి, ద్రౌపదులు ఆదర్శ జీవితములు గడిపి నేటికి మన హృదయాంతరాళములందు సజీవులై యున్నారన్నారు.

### ఉపసంహారసభ

భారతవీర ప్రశస్తి సభలకు సముచితముగా ఉపసంహారసభ యీ నెల 6 తేది శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి గారి అధ్యక్షతన జరుపబడినది. అధ్యక్షులు భారతవీర ప్రశస్తి సక్రమముగా నిర్వహింపబడినందులకు కార్యకర్తలను శ్లాఘించారు.

పిమ్మట శ్రీ పోలూరి హనుమజ్జానకీరామ శర్మగారు శ్రీ కృష్ణునిచరిత్ర జీవన్ముక్తిని జీవ

—తరువాత 4వ పేజీలో




Edited, Printed and Published by N. Sree Ramamurthy at the Zamin Ryot Power Press. 170, Thipparajuvari St. Nellore.